వ్యవసాయానికి ఉపాధిహామీ అనుసంధానం చేసేదెప్పుడు...?

- వ్యవసాయానికి ఉపాధి హామీ పథకాన్ని అనుసంధానం చేయాలని ఎప్పటి నుంచే కోరుతున్న రైతులు
- ఆ దిశగా అడుగులు వేయని కేంద్ర ప్రభుత్వం
- వ్యవసాయ పనులకు కూలీల కొరత
- రైతులకు ఏటా పెరుగుతున్న పెట్టుబడులు
- ఉపాధి హామీ పథకాన్ని అనుసందానిస్తే రైతులకు మేలు



కుమరాం గ్రామంలో ఉపాధి పనులు చేస్తున్న వేతనదారులు (ఫైల్)

చీపురుపల్లి రూరల్(గరివిడి): జాతీయ ఉపాధి హామీ పథకాన్ని కేంద్ర ప్రభుత్వం వ్యవసాయ రంగానికి ఎప్పుడు అనుసంధానం చేస్తుందా అని రైతులు ఎదురు చూస్తున్నారు. ఏటా పెరుగుతున్న పెట్టుబడులకు తోడు కూలీల కొరతతో వ్యవసాయం రైతులకు పెనుభారంగా మారింది. ఉపాధి హామీ పథకాన్ని వ్యవసాయానికి అనుసంధానం చేస్తే కూలీల సమస్యకు పరిష్కారం లభించడంతో పాటు సాగుపెట్టుబడి కూడా తగ్గుతుందని రైతులు అంటున్నారు.అయితే ఎన్నో ఏళ్లుగా రైతుల నుంచి ఈ డిమాండ్ ఉన్నప్పటికీ కేంద్ర ప్రభుత్వం ఆదిశగా అడుగులు వేయడం లేదు.

కూలీల కొరత తీవ్రం

కూలీలు ఎక్కువగా ఉపాధి పనులకు వెళుతుండడంతో వ్యవసాయ పనులకు వారి కొరత ఏర్పడుతోంది. దీంతో కూలి రేట్లు పెరగడంతో పాటు సకాలంలో వ్యవసాయ పనులు పూర్తికాక రైతులు ఇబ్బందులు పడుతున్నారు. చీపురుపల్లి నియోజకవర్గంలోని చీపురుపల్లి, గరివిడి, గుర్ల, మెరకముడిదాం మండలాల్లో సాధారణంగా ఏటా ఖరీఫ్ సీజన్‌లో 30,500 ఎకరాల్లో వరి పంట సాగువుతోంది. అలాగే మొక్కజొన్న, వేరుశనగ, మిరప, బొప్పాయి, పత్తి, మినప, పెసర,ఉలవ తదితర పంటలను 11వేల ఎకరాల్లో సాగు చేస్తున్నారు. సాధారణంగా ఖరీఫ్ సీజన్‌లో వరిసాగుకు ఎకరానికి రూ.25 వేలపైనే పెట్టుబడి అవుతోందని రైతులు చెబుతున్నారు. అలాగే మొక్కజొన్న, మిరప, పత్తి, వేరుశనగ, మినప, తదితర పంటలకూ అంతే మొత్తంలో పెట్టుబడి అవుతోందని అంటున్నారు. వ్యవసాయ యంత్రపరికరాలు అందుబాటులో ఉన్నప్పటికీ కొన్ని పనులు మనుషులే చేయాల్సి ఉంటుంది. ఖరీఫ్ సీజన్‌లో కూలీలకు భోజనం పెడుతూ రోజుకు రూ.600 ఇవ్వాల్సి వస్తోందని, ఇంత మొత్తంలో కూలి ఇచ్చినప్పటికీ కూలీలు లభించడం లేదని రైతులు అంటున్నారు. చీపురుపల్లి నియోజకవర్గంలోని నాలుగు మండలాల్లో 31,334 మంది ఉపాధి హామీ పనులకు హాజరవుతున్నారు. ఉపాధి హామీ పథకం వచ్చినప్పటి నుంచీ ప్రధానంగా చెరువు పనులే చేయిస్తున్నారు. ఈ పథకాన్ని వ్యవసాయానికి అనుసంధానం చేస్తే కూలీల కొరత తీరుతుంది.పొలం పనులకు అయ్యే ఖర్చుల్లో 50 శాతం ఉపాధి హామీ పథకం ద్వారా చెల్లిస్తే ఎంతో మేలు జరుగుతుందని రైతులు అంటున్నారు. ఇలా చేయడం వల్ల సాగు విస్తీర్ణం కూడా పెరిగే అవకాశం ఉందని, కేంద్ర ప్రభుత్వం ఆదిశగా చర్యలు తీసుకునేలా రాష్ట్ర ప్రభుత్వం ఒత్తిడి తీసుకురావాలని రైతులు కోరుతున్నారు.

రైతులను ఆదుకోవాలి

ఉపాధి హామీ పథకాన్ని వ్యవసాయానికి అనుసంధానం చేస్తే రైతులకు ఎంతో మేలు జరుగుతుంది. వేల రూపాయలు పెట్టుబడి పెట్టి పంటలు సాగుచేస్తున్నప్పటికీ పంట చేతికి వచ్చేంత వరకు నమ్మలేకపోతున్నాం.అతివృష్టి, అనావృష్టి, చీడపీడల వల్ల నష్టపోతున్నాం. కూలీల ఖర్చు పెరిగిపోయింది. ప్రభుత్వం ఉపాధి హామీ పథకాన్ని వ్యవసాయానికి అనుసంధానం చేసి రైతులను ఆదుకోవాలి.

– ఆర్.వెంకటేష్, పి.కె.పాలవలస, చీపురుపల్లి మండలం

ఎప్పటి నుంచో ఎదురు చూస్తున్నాం..

ఉపాధి హామీ పథకాన్ని వ్యవసాయ రంగానికి అనుసంధానం చేస్తారని ఎప్పటి నుంచో ఎదురు చూస్తున్నాం. పెరిగిన పెట్టుబడులతో వ్యవసాయం చాలా కష్టంగా మారింది. లాభాల సంగతి పక్కన పెడితే ఒక్కోసారి పెట్టుబడి కూడా రావడం లేదు. ఉపాధి పథకాన్ని వ్యవసాయానికి అనుసంధానం చేస్తే రైతుకు కొంత వరకు మేలు జరుగుతుంది.

– గేదెల శంకరరావు, కోడూరు, గరివిడి మండలం

క్లుప్తంగా

రాజరాజేశ్వరీదేవికి ప్రత్యేక పూజలు



పూజలందుకుంటున్న అమ్మవారు

బొండపల్లి: దేవుపల్లి గ్రామంలోని రాజరాజేశ్వరీదేవి ఆలయంలో అర్చకులు దూసి శ్రీధర్ శర్మ అమ్మవారికి ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. గ్రామస్తులతో పాటు వివిధ గ్రామాలకు చెందిన భక్తులు ప్రభలు, ఘటాలతో ఆలయానికి చేరుకుని మొక్కులు చెల్లించుకున్నారు.

వైభవంగా ఆలయ ప్రతిష్ఠోత్సవాలు



సీతారామ లక్ష్మణుల విగ్రహాలను ఊరేగిస్తున్న భక్తులు

కొత్తవలస: స్థానిక మేజర్ పంచాయతీ పరిధి గవరపాలెంలో మూడురోజుల పాటు నిర్వహించనున్న సీతారాముల ఆలయ ప్రతిష్ఠోత్సవాలు ఆదివారం వైభవంగా ప్రారంభమయ్యాయి. వేదపండితులు కప్పగంతుల ప్రసాద్‌శర్మ, వేమూరి శ్రీరామ్మూర్తి శర్మ గ్రామస్తులతో పూజలు చేయించి, మూల విరాట్‌లను ఊరేగించారు. 23వ తేదీన విగ్రహాలను ప్రతిష్ఠిస్తామని వేదపండితులు తెలిపారు. మూడు రోజుల పాటూ శ్రీసీతారామ గౌరీసేవా సంఘం, గురుదేవా చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో పూజా కార్యక్రమాలను నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు చెప్పారు.

గుండె పోటుతో ఉద్యోగి మృతి



మహేశ్వరరావు (ఫైల్)

వేపాడ: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సీనియర్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న టి.వి.వి.మహేశ్వర రావు ఆదివారం ఉదయం గుండెపోటుతో మృతిచెందారని ఎంపీడీఓ సీహెచ్ సూర్యనారాయణ తెలిపారు. ఎంపీడీఓతో పాటు కార్యాలయ సిబ్బంది, పంచాయతీ కార్యదర్శులు మండల కేంద్రంలో మృతుడు మహేశ్వరరావు కుటుంబాన్ని పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు.మృతుడికి భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు.

ఘనంగా ఈస్టర్ వేడుకలు



ఆర్‌సీఎం చర్చిలో ప్రార్థనలు చేస్తున్న క్రైస్తవులు

దత్తిరాజేరు: మండలంలోని పెదమానాపురం ఆర్‌సీఎం చర్చిలో ఈస్టర్ వేడుకలను ఆదివారం ఘనంగా నిర్వహించారు. క్రైస్తవులు చర్చిలో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. పాస్టర్ సాగర్‌బాబు మాట్లాడుతూ శిలువపై ప్రాణత్యాగం చేసిన ఏసు ప్రభువు..మూడో రోజు సజీవుడై ప్రజల మధ్యకు వచ్చారని, ఆరోజుకు గుర్తుగా ఈస్టర్ పండగ నిర్వహించుకుంటున్నట్లు చెప్పారు. క్రీస్తు పునరుత్థానం ప్రజలందరికీ శుభదినమని, జీసస్ చూపిన ప్రేమ, శాంతి మార్గాలను అనుసరించాలని సూచించారు.

ఇంటింటికీ భగవద్గీత



భగవద్గీత పుస్తకాలు పంపిణీ చేస్తున్న కోటేశ్వరరావు, తదితరులు

శృంగవరపుకోట: స్థానిక మోక్షవిద్య యోగమందిర్ సంస్థ నిర్వాహకులు శీలా కోటేశ్వరరావు నేతృత్వంలో పట్టణంలోని యడ్లవీధిలో ఆదివారం ఇంటింటికీ భగవద్గీత పుస్తకాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కోటేశ్వరరావు మాట్లాడుతూ భగవద్గీత పఠనం ప్రతీ భారతీయుని కర్తవ్యం అన్నారు. ప్రతీ ఇంటిలో భగవద్గీత ఉండాలన్న లక్ష్యంతో దాతల సహాయ, సహ కారాలతో ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని చెప్పారు. పుస్తకాలు కావాలిస్నవారు 99893 68781 లేదా 98667 57311 నంబర్లను సంప్రదించాలని సూచించారు.

కొబ్బరి రైతులను ఆదుకోవాలి



రైతులతో కలిసి మాట్లాడుతున్న లోక్‌సత్తా కార్యదర్శి ప్రసాద్

శృంగవరపుకోట: కొబ్బరి రైతులను ఆదుకునేందుకు జిల్లా అధికార యంత్రాం గం చర్యలు తీసుకోవాలని లోక్‌సత్తా పార్టీ జిల్లా కార్యదర్శి కాండ్రేగుల ప్రసాద్ డిమాండ్ చేశారు. మండలంలోని భర్తాపురం గ్రామంలో కొబ్బరి తోటలను ఆదివారం ఆయన పరిశీలించారు.అనంతరం రైతులతో కలిసి ఆయన విలేకరులతో మాట్లాడారు. చనిపోయిన కొబ్బరి మొక్కల స్థానంలో కొత్త మొక్కలు నాటడం, వాటి పునరుద్ధరణ కోసం ప్రభుత్వం ప్రవేశ పెట్టిన రీప్లాంటింగ్ అండ్ రెజువెనేషన్ ఆఫ్ కోకోనట్ గార్డెన్ స్కీమ్‌ను జిల్లాలోని కొబ్బరి రైతులకు వర్తింప చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కూలీల కొరతతో వ్యవసాయం చేయలేక రైతాంగం ఉద్యానవన పంటల వైపు మొగ్గు చూపుతున్నారని, ఉద్యానవన పంటల్లోనూ రైతులకు నష్టాలు తప్పడం లేదన్నారు. కొబ్బరిని మొవ్వ పురుగు, బూడిద తెగులు ఆశించడం వల్ల చెట్లు చనిపోతున్నాయని అన్నారు. చనిపోయిన మొక్కలకు పరిహారం చెల్లించి, తిరిగి ప్లాంటేషన్ చేసేందుకు మొక్కకు రూ.1000 చొప్పున రైతులకు చెల్లించాలని, కోరారు. రైతులు కె.రాము, బీశెట్టి స్వామినాయుడు, కె.ఆర్.వెంకట సత్యనారాయణ, ఎల్లపు స్వరూప్, కె.సత్యంనాయుడు, తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి వీఓఏలకు శిక్షణ

వేపాడ: వెలుగు ఆధ్వర్యంలో మండలంలో పని చేస్తున్న 35 మంది వీఓఏలకు జిల్లా కేంద్రం విజయనగరంలో సోమ,మంగళవారాల్లో శిక్షణ ఇవ్వనున్నట్లు ఏపీఓ సూర్యనారాయణ ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. వీఓఏలు అంతా రెండు రోజుల శిక్షణ తరగతులకు హాజరు కావాలని సూచించారు. బుక్ కీపింగ్, తదితర అంశాలకు సంబంధించి కేంద్ర ప్రభుత్వం ఆధీనంలో కొత్త పోర్టల్ వినియోగంపై శిక్షణ ఇవ్వనున్నట్లు స్పష్టం చేశారు.

ఆందోళనను విజయవంతం చేయండి

- వ్యవసాయ కార్మిక సంఘ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వెంకటేశ్వర్లు



సమావేశంలో మాట్లాడుతున్న వెంకటేశ్వర్లు

విజయనగరం ఫోర్ట్: సమస్యలను పరిష్కరించాలని కోరుతూ మే 20న నిర్వహించనున్న ఆందోళనలో కార్మికులు, కూలీలు, రైతులు పాల్గొని విజయవంతం చేయాలని వ్యవసాయ కార్మిక సంఘ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వి. వెంకటేశ్వర్లు పిలుపునిచ్చారు. ఆదివారం స్థానిక ప్రజా సంఘాల కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. అర్హులకు ఉపాధి పనులు కల్పించడం లేదని ఆరోపించారు. వేతనదారులకు రోజుకు 600 రూపాయల వేతనం ఇవ్వాలని కోరుతున్నా.. 300 రూపాయల్లోపే వేతనం వస్తోందని చెప్పారు. పెండింగ్ బిల్లులను వెంటనే విడుదల చేయాలని కోరారు. పాలధరలు పెంచకపోవడం.. మందులు, దాణా రేట్లు పెరిగిపోవడంతో పాడి రైతులు ఇబ్బంది పడుతున్నారన్నారు. అలాగే గిట్టుబాటు ధరలు లేక రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని తెలిపారు. ప్రాజెక్టులు పూర్తి చేయకపోవడంతో సాగునీరందక రైతులు ఇబ్బంది పడుతున్నారన్నారు. ప్రభుత్వం స్పందించి సమస్యలను పరిష్కరించాలని కోరారు. సమావేశంలో కార్మిక సంఘ జిల్లా ప్రధాన కార్యదర్శి గాడి అప్పారావు, రైతు సంఘ జిల్లా కార్యదర్శి బుద్దరాజు రాంబాబు పాల్గొన్నారు.

ముగిసిన అగ్నిమాపక వారోత్సవాలు



గజపతినగరం : అగ్ని ప్రమాదాల నియంత్రణకు వినియోగించే పరికరాలను ప్రదర్శిస్తున్న ఎస్ఎఫ్ఓ రవిప్రసాద్



కొత్తవలస: అగ్నిప్రమాదాలు సంభవించే సమయంలో రక్షించుకునే విధానంపై అవగాహన కల్పిస్తున్న ఎస్ఎఫ్ఓ అశోక్‌కుమార్

గజపతినగరం/కొత్తవలస: జాతీయ అగ్నిమాపక వారోత్సవాలు ఆదివారంతో ముగిశాయి. గజపతినగరం, కొత్తవలస మండల కేంద్రాల్లో అగ్నిమాపక శాఖ అధికారులు ఎం.ఎస్.వి.రవిప్రసాద్, అశోక్‌కుమార్ దుకాణాలు, పాఠశాలలు, కళాశాలలు, పెట్రోల్ బంకుల వద్ద ప్రజలు, విద్యార్థులకు అగ్నిప్రమాదాల నివారణపై అవగాహన కల్పించారు. గ్యాస్ లీకేజ్, సాధారణ, విద్యుత్ షార్ట్ సర్క్యూట్ వల్ల అగ్ని ప్రమాదాలు సంభవించేప్పుడు పాటించాల్సిన జాగ్రత్తలు, మంటలను అదుపు చేయడం, అలాగే బోటులో ప్రయాణించే సమయంలో ప్రమాదాలు సంభవిస్తే లైఫ్ జాకెట్స్, తదితర పరికరాల సహాయంతో బయటపడే విధానాలను వివరించారు. అనంతరం ప్రమాదాలు జరగకుండా అనుసరించాల్సిన పద్ధతులు, ఫైర్ స్టేషన్ల ఫోన్ నెంబర్లు, తదితర వివరాలతో కూడిన కరపత్రాలను పంపిణీ చేశారు.

మద్యం తాగి వాహనాలు నడిపితే చర్యలు




లక్కవరపుకోట: డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీ చేస్తున్న ఎస్ఐ నవీన్‌పడాల్

లక్కవరపుకోట: మద్యం తాగి వాహనాలు నడిపితే కఠిన చర్యలు తప్పవని ఎస్ఐ నవీన్ పడాల్ హెచ్చరించారు. మండలంలోని అరకు– విశాఖ జాతీ య రహదారిలోని ఎల్.కోట, గోల్డ్ స్టార్ జంక్షన్‌లలో పోలీస్ సిబ్బందితో కలిసి ఆదివారం వాహన, డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు నిర్వహించారు. ప్రతీ వాహనాన్ని నిలిపి వాహన చోదకులను బ్రీత్ ఎనలైజర్‌తో పరీక్షించారు. అలాగే అధిక లోడ్‌తో ప్రయాణించే వాహనాలను గుర్తించి వాటిపై కేసులు నమోదు చేశారు.

మైనర్లకు వాహనాలు ఇవ్వొద్దు

దత్తిరాజేరు: మైనర్లకు ఎవరూ వాహనాలు ఇవ్వొద్దని, ఒక వేళ వాహనాలు ఇస్తే సంబంధిత వాహన యజమానిపై కేసు నమోదు చేస్తామని ఎస్. భూర్జవలస ఎస్ఐ జి.రాజేష్ అన్నారు.ఎస్.భూర్జవలసలో ఆదివారం వాహన తనిఖీలు చేశారు. ద్విచక్ర వాహన చోదకులు విధిగా హెల్మెట్ ధరిం చాలని, అలాగే తప్పనిసరిగా వాహన సంబంధిత పత్రాలతో పాటు లైసెన్స్ కలిగి ఉండాలని అన్నారు.

మానవత్వం చాటుకున్న ముస్లిం మత పెద్దలు



మృతదేహాన్ని గమ్యస్థానానికి చేర్చేందుకు ఏర్పాటు చేసిన ఫ్రీజర్ అంబులెన్స్

విజయనగరం టౌన్: అనారోగ్యంతో మృతి చెందిన మహిళ మృతదేహాన్ని స్వగ్రామానికి చేర్చేందుకు ముస్లిం మత పెద్దలు ముందుకొచ్చారు. బాపట్ల జిల్లా ఇంకొల్లు మండలం కొనికి గ్రామానికి చెందిన షేక్ కరీమున్ మతిస్థిమితం లేక కొద్ది రోజుల కిందట జామి గ్రామానికి చేరుకుంది. అక్కడ ఆమెకు ఆరోగ్యం క్షీణించడంతో స్థానిక జర్నలిస్ట్ రంభ రమణ, జామి పోలీసుల సహకారంతో జిల్లా కేంద్రాస్పత్రిలో చేర్పించారు. 21 రోజుల పాటు ట్రీట్‌మెంట్ జరిగిన అనంతరం ఆమె మృతి చెందారు. ఈ మేరకు వారి కుటుంబ సభ్యులకు సమాచారమందించగా వారు ఆదివారం జిల్లాకు చేరుకున్నారు. అయితే మృతదేహాన్ని తరలించేందుకు వారి దగ్గర డబ్బులు లేని విషయాన్ని తెలుసుకున్న జామి కానిస్టేబుల్ కుమార్, యూత్ ఫౌండేషన్ అధ్యక్షుడు షేక్ ఇల్తమాష్, కానిస్టేబుల్ షఫీ ముస్లిం మత పెద్దలకు పరిస్థితి వివరించారు. దీంతో అందుబాటులో ఉన్న దాతలు షేక్ ముజ్జు, రాఖీబ్, నయీమ్, రెహమాన్, ఏటీకే అధ్యక్షుడు ఖలీల్‌బాబు, ఇర్ఫాన్ , మెహబూబ్ షరీఫ్‌లు ఫ్రీజర్ అంబులెన్స్ ఏర్పాటు చేశారు. దీంతో కరీమున్ మృతదేహాన్ని కుటుంబ సభ్యులు స్వగ్రామానికి తీసుకెళ్లారు. కార్యక్రమంలో యూత్ ఫౌండేషన్ సభ్యులు రాయల్ క్యాబ్స్ శరత్, అశోక్, సాయి, రాము, రఘు, విజయకాంత్, వర్మ, వినయ్, తదితరులు పాల్గొన్నారు.

• ఉల్లాసంగా...ఉత్సాహంగా



గుర్ల మండలంలోని పాలవలస ప్రాథమిక పాఠశాల వార్షికోత్సవం హెచ్ఎం సూర్యనారాయణ ఆధ్వర్యంలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు ఆట, పాటలు, నృత్యాలతో సందడి చేశారు. అతిథిగా హాజరైన వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు పొట్నూరు సన్యాసినాయుడు మాట్లాడుతూ చదువుతో పాటు అన్ని రంగాల్లో రాణించాలని విద్యార్థులకు సూచించారు. సర్పంచ్ వల్లూరి రాము, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. – గుర్ల

• పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



గరివిడి శ్రీరామ్ హైస్కూల్ (ప్రస్తుతం ఉమెన్ అండ్ చైల్డ్ వెల్ఫేర్ సెంటర్)లో 1989–90 విద్యా సంవత్స రంలో పదోతరగతి చదువుకున్న పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం ఆదివారం ఆ పాఠశాల వేదికగా జరిగింది. పాఠశాల చదువుల అనంతరం వేర్వేరు ప్రాంతాల్లో ఉన్నత చదువులు చదువుకుని, వివిధ రంగాల్లో స్థిరపడిన వారంతా మూడున్నర దశాబ్దాల తర్వాత కలుసుకోవడంతో ఒకరినొకరు ఆప్యాయంగా పలకరించుకున్నారు. కుటుంబ జీవితం గురించి పరస్పరం తెలుసుకుని, చిన్న నాటి జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. అప్పటిలో తమకు పాఠాలు చెప్పిన ఉపాధ్యాయులను ఘనంగా సత్కరించారు. అనంతరం సహ పంక్తి భోజనాలు చేశారు. – చీపురుపల్లి రూరల్(గరివిడి)

• నియోజకవర్గస్థాయి క్విజ్ పోటీలు



విజేతలతో ఉపాధ్యాయులు

లక్ష్య ఫౌండేషన్ ఆధ్వర్యంలో కర్రి పవిత్రలహరి ఆర్థిక సాయంతో ఎస్.కోటలోని చైతన్య జూనియర్ కళాశాల వేదికగా ఆదివారం నిర్వహించిన ఎస్.కోట నియోజకవర్గస్థాయి క్విజ్ పోటీలకు చక్కని స్పందన వచ్చింది. ఎస్.కోట, ఎల్.కోట, వేపాడ మండలాల్లోని ప్రభుత్వ పాఠశా లల్లో చదువుతున్న 8,9,10 తరగతుల విద్యార్థులు 110 మంది హాజరు కాగా, వీరిని 22 గ్రూపులుగా విభజించి వేర్వరు ప్రభుత్వ పాఠశాలల ఉపాధ్యాయుల పర్యవేక్షణలో పోటీలు నిర్వహించారు. కుమరాం హైస్కూల్ విద్యార్థులు ప్రథమ స్థానంలో నిలిచి రూ.6 వేల నగదు బహుమతి గెలుచుకున్నారు. పెద వేమలి హైస్కూల్ విద్యార్థులు ద్వితీయ స్థానంలో నిలిచి రూ.4,500, రంగాపురం ఎంజేబీ పాఠశాల విద్యార్థులు తృతీయస్థానంలో నిలిచి రూ.3,000, కొత్తవలస మోడల్ స్కూల్ విద్యార్థులు నాలుగో స్థానంలో నిలిచి రూ.1,500, కొట్యాడ హైస్కూల్ విద్యార్థులు అయిదో స్థానంలో నిలిచి రూ.1200 నగదు బహుమతి గెలుచుకున్నారు. – శృంగవరపుకోట

అయ్యారక సంఘం వెబ్‌సైట్ ప్రారంభం



వెబ్‌సైట్ ప్రారంభోత్సవంలో మాట్లాడుతున్న అయ్యారక సంఘం జాతీయ ప్రధాన కార్యదర్శి రాజశేఖర్

కొత్తవలస: అయ్యారక సంక్షేమ సంఘం వెబ్‌సైట్‌ను మండలంలోని కొత్తసుంకరపాలెం గ్రామంలో ఆ సంఘం జాతీయ ప్రధాన కార్యదర్శి పెదిరెడ్ల రాజశేఖర్ ఆదివారం ప్రారంభిం చారు. ఈ సందర్భంగా సంఘం పెద్దలు మాట్లాడుతూ ఈవెబ్‌సైట్‌లో అయ్యారక సామాజిక వర్గానికి సంబంధించిన పూర్తి వివరాలను పొందుపరుస్తామని, అయ్యారక కులస్తులు ఎదుర్కొం టున్న సమస్యలకు పరిష్కారం చూపించే సమాచారాన్ని వెబ్‌సైట్‌లో ఉంచుతామని తెలిపా రు.సంఘం జాతీయ ప్రధాన కార్యదర్శి రాజశేఖర్ మాట్లాడుతూ అయ్యారక కులస్తులకు సంబం ధించి విద్య,ఉద్యోగ,వ్యాపార,రాజకీయ రంగాల్లో చెప్పుకోదగ్గ మార్పులేదన్నారు. అయ్యారక కులస్తుల సంక్షేమం కోసం ప్రభుత్వం తక్షణమే అయ్యారక వెల్ఫేర్ అండ్ డవలెప్మెంట్ కార్పొరేషన్ ఏర్పాటు చేసి, నిధులు కేటాయించాలని డిమాండ్ చేశారు. నియోజకవర్గం నుంచి రాష్ట్రస్థాయి వరకు నామినేటెడ్ పదవుల్లో అయ్యారక కులస్తులకు తగిన ప్రాధాన్యత ఇవ్వాల న్నారు. అయ్యారక సంక్షేమ సంఘం నాయకులు లెంక రామన్నపాత్రుడు, పి.ఎస్.ఎన్.పాత్రుడు, బంగారు అప్పారావు, బి.శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

ఏపీ ఆర్ఎస్ఏ అధ్యక్షురాలిగా అరుణకుమారి



ఎస్.కోట తహసీల్దార్ అరుణకుమారి



ఏపీ ఆర్ఎస్ఏ జిల్లా కార్యదర్శిగా ఎన్నికైన రాజేశ్వరరావుకు శుభాకాంక్షలు చెబుతున్న సభ్యులు

శృంగవరపుకోట/బొండపల్లి: ఏపీ రెవెన్యూ ఉద్యోగుల సేవా సంఘం(ఆర్ఎస్ఏ) ఎన్నికల్లో ఎస్.కోట తహ సీల్దార్‌కు గౌరవం దక్కింది. జిల్లా కేంద్రంలోని కలెక్టర్ కార్యాల యంలో విజయనగరం డివిజన్ స్థాయి రెవెన్యూ సేవా సంఘం నూతన కార్యవర్గాన్ని ఆదివారం ఎన్నుకున్నారు. సంఘం అధ్యక్షురాలిగా ఎస్.కోట తహసీల్దార్ ఎం. అరుణకుమారి, ప్రధాన కార్యదర్శిగా బొండపల్లి తహసీల్దార్ రాజేశ్వరరావును సభ్యులు ఎన్నుకున్నారు. వారికి రెవెన్యూ ఉద్యోగులు శుభాకాంక్షలు తెలిపారు.

రక్తదానం.. ప్రాణదానంతో సమానం

- ఎమ్మెల్సీ సురేష్‌బాబు



రక్తదానం చేస్తున్న ఎమ్మెల్సీ డాక్టర్ పీవీవీ సూర్యనారాయణ రాజు

నెల్లిమర్ల: రక్తదానం.. ప్రాణ దానంతో సమానమని ఎమ్మెల్సీ డాక్టర్ పీవీవీ సూర్యనారాయణ రాజు(సురేష్ బాబు) అన్నారు. నగర పంచాయతీ పరిధిలోని జరజాపుపేటలో సాధనా యువజన సంఘ ఉపాధ్యక్షుడు నల్లి ఉమాశంకర్ జ్ఞాపకార్థం సంఘ సభ్యులు ఆదివారం ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. అనంతరం సురేష్‌బాబు రక్తదానం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఉమాశంకర్ జ్ఞాపకార్థం రక్తదాన శిబిరం ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. యువత రక్తదానానికి ముందుకు రావాలని పిలుపునిచ్చారు. అనారోగ్యంతో మృతి చెందిన నల్లి ఉమాశంకర్ కుటుంబానికి ఎమ్మెల్సీ తనవంతు సాయంగా లక్ష రూపాయలు అందజేశారు. కార్యక్రమంలో నగర పంచాయతీ వైస్ చైర్మన్ సముద్రపు రామారావు, సాధనా అధ్యక్షుడు పోలుబోతు దుర్గాప్రసాద్, స్థానిక పెద్దలు పోలుబోతు రామారావు, ఆరిపాక శ్రీనివాసరావు, నల్లి శ్రీను, అప్పలరాజు, తుమ్మ నారాయణమూర్తి, తదితరులు పాల్గొన్నారు.